క్లుప్తంగా

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు అప్పనపల్లికి చెందిన మొల్లేటి శ్రీనివాస్, సుప్రియ దంపతులు బుధవారం రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగికి అందజేశారు. విరాళం అందించిన దాతకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. వారిని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ అభినందించారు.

సంస్కృతీ సంప్రదాయాలను వివరించాలి



అంబాజీపేటలో వరలక్ష్మి అలంకరణలో గీత

అంబాజీపేట: చిన్నతనం నుంచి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులకు తెలపాలని దానివల్ల వారిలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయని ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట నాగమల్లి చెట్టువద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వాడ్రేవు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం జి.గీతకి వరలక్ష్మీ దేవిగా అలంకరణ చేశారు. సంప్రదాయ అలంకరణల వల్ల విద్యార్థుల్లో సజనాత్మకత పెరుగుతుందని హెచ్ఎం మూర్తి అన్నారు. వరలక్ష్మి అవతారంతో గీత పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ డి.లక్ష్మి, మహిళా ఉపాధ్యాయులు ఎం.వరలక్ష్మి, డి.లక్ష్మీ రమణ, పి.వరలక్ష్మి, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న సీహెచ్ఓ సుస్మిత



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటున్న సుస్మిత

సఖినేటిపల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అంతర్వేదిపాలెం-2 ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జిల్లెళ్ళ సుస్మిత బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం అవార్డులు ప్రదానోత్సవంలో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు ఆమెకు దక్కింది. ఈ మేరకు కలెక్టర్, డీఎంహెచ్ఓ దొర అవార్డు ఆమెకు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన మార్ని వెంకట శివదుర్గాప్రసాద్, సత్య రామలక్ష్మి నాగకుమారి దంపతులు బుధవారం రూ.25 వేలు విరాళంగా సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తికి అందించారు.

రాజకీయ కక్షతోనే పింఛన్ నిలిపివేత



కె నాగలక్ష్మి

అంబాజీపేట: తన కుమారుడు ప్రతిపక్ష పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉండటం వల్లే రాజకీయ కక్షగట్టి తన పింఛన్‌ నిలిపివేశారని వక్కలంకకు చెందిన కొప్పిశెట్టి నాగలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. జూలై వరకు వికలాంగ పింఛన్ ఇచ్చి ఆగస్టులో ఇవ్వలేదన్నారు. వికలాంగ పింఛన్‌తో పాటు అభయ హస్తం పింఛన్ కూడా వచ్చేదన్నారు. అయితే ఆగస్టులో ఒక అభయ హస్తం పింఛన్ ఇచ్చి వికలాంగ పింఛన్ ఇవ్వలేదన్నారు. దీనిపై పంచాయతీ అధికారుల వద్దకు వెళ్లి అడగ్గా ఆరు పింఛన్లు వేరే సచివాలయ ఉద్యోగి లాగిన్లో ఉండిపోవడం వల్ల ఇవ్వలేకపోయామని కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి తాతాజీని వివరణ కోరగా నూతనంగా వచ్చిన సచివాలయ ఉద్యోగి లాగిన్‌లో 6 పింఛన్లు ఉండిపోయాయని ఒక్క నాగలక్ష్మి పింఛన్ మాత్రమే ఇవ్వలేదన్నారు. కొత్తగా వచ్చిన సచివాలయ ఉద్యోగి నాగలక్ష్మి ఇల్లు గుర్తించలేకపోవడం వల్ల పింఛన్ ఇవ్వలేకపోయామన్నారు. వచ్చే నెలలో రెండు పింఛన్లు ఇస్తామన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు కేసుల నమోదు

ఆలమూరు: జొన్నాడ బస్టాండు సెంటర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. వివరాల్లోకి వెళితే జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ నేతృత్వంలో ఆలమూరు ఎస్సై ఎస్.నరేష్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని గురువారం సివిల్‌జడ్జి వద్ద హాజరుపరచనున్నట్టు ఎస్సై తెలిపారు.

నిరుపయోగంగా పంట భూములు

- రైతులను వేధిస్తున్న ముంపు సమస్య
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

మామిడికుదురు: వాడబోది మీడియం డ్రైన్ నుంచి వచ్చే ఉప్పు నీరు ఉప్పొంగి పంట పొలాలను ముంచెత్తడం, వర్షం నీరు నిలిచిపోవడంతో సుమారు 400 ఎకరాల పంట పొలాలు నిరుపయోగంగా మారాయి. కొబ్బరిచెట్ల మొవ్వులు విరిగి పడిపోతున్నాయి. పంట పొలాలు చౌడు బారి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. ఎంతో కాలం నుంచి ఈ సమస్య ఉన్న దీన్ని శాశ్వతంగా పరిష్కరించే చర్యలు కానరావడం లేదని రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాలకు చెందిన రైతులు కాలం నుంచి ముంపు సమస్యతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్లు వల్ల ముంపు నీటి సమస్య ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రైతుల నుంచి నిరసన వ్యక్తమవుతున్న సమయంలో అరకొర నష్ట పరిహారం ఇస్తూ రైతులను ఓఎన్జీసీ అధికారులు మభ్య పెడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ, డ్రైనేజ్ విభాగం, ఓఎన్జీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

వాడబోది డ్రైన్‌ను ఆధునీకరించాలి

ముంపు నీటి సమస్య పరిష్కారానికి ప్రధానంగా వాడబోది మీడియం డ్రైన్‌ను ఆధునీకరించాల్సి ఉంది. ఈ డ్రైన్ గట్లను బలోపేతం చేయాలి. ఓఎన్జీసీ నిర్మించిన రోడ్లలో ఏర్పాటు చేసిన తూరలు శిథిలం కావడం వల్ల ముంపునీరు దిగడం లేదు. పాడైపోయిన తూరలను తొలగించి కొత్తగా సిమెంట్ తూరలు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో పాటు డ్రైన్‌లో ఏర్పాటు చేసిన అధికార, అనధికార క్రాస్ బండ్లను పూర్తిస్థాయిలో తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పైన పేర్కొన్న పనులను చేపట్టేందుకు ఓఎన్జీసీ గతంలో హామీ ఇచ్చిందని కానీ వాటిని అమలు చేయలేదని పేర్కొంటున్నారు. ఓఎన్జీసీ ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పాశర్లపూడిబాడవలో ముంపుతో నిరుపయోగంగా మారిన పంట పొలాలు

శాశ్వత పరిష్కారం చూపాలి



ఎన్నో ఏళ్ల నుంచి ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. గతంలో ఎంతో సారవంతమైన భూములుగా గుర్తింపు పొందిన మా భూములు ప్రస్తుతం ఉప్పు నీటి మయంగా మారాయి. ఈ భూములకు తిరిగి పూర్వ వైభవంగా తీసుకువచ్చే దిశగా చర్యలు తీసుకోవాలి. మా డిమాండ్లపై స్పందించని పక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తాం.

– నిమ్మన అప్పారావు, రైతు, పాశర్లపూడి

డ్రైన్‌లో అడ్డుకట్టలు తొలగించాలి



వాడబోది డ్రైన్‌లో అడ్డుకట్టలు వేస్తున్నారే తప్ప వాటిని తొలగించడం లేదు. గోదావరి పోటు సమయంలో ఉప్పు నీరు పంట పొలాలను ముంచెత్తుతోంది. వరి పండించే పొలాలు చౌడు భూములుగా మారిపోయి ఎందుకూ పనికి రావడం లేదు. కొబ్బరి చెట్లు వెర్రి తలలు వేసి మొవ్వులు విరిగిపడిపోతున్నాయి. వీటిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కట్టా సత్యనారాయణ, రైతు, పాశర్లపూడి

ఇబ్బందులు పడుతున్నాం ఆదుకోండి



ఓఎన్జీసీ వేసిన రోడ్ల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి. రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. పాశర్లపూడిబాడవ, పాశర్లపూడిలంక ప్రాంతంలో భూములు అమ్ముదామన్నా కొనే దిక్కు లేదు. ఆడపిల్లలకు కట్నంగా ఇద్దామన్నా తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. ఇదీ ఇక్కడ ప్రస్తుతం ఉన్న పరిస్థితి.

– మేడిది నాగేశ్వరరావు, రైతు, పాశర్లపూడి

ఎరువుల వినియోగం తగ్గించాలి

మలికిపురం: వ్యవసాయంలో ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానం పెంచాలని ఏడీఏ ఎస్.రాకేశ్ అన్నారు. రాజోలు డివిజన్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఇందులో భాగంగా మలికిపురం మండలం ఎంఎస్‌వీఏఎస్, జేఎస్ఆర్‌వీఆర్ డిగ్రీ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎస్.రాకేష్ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి రైతు వ్యవసాయంలో భాగస్వామ్యం అయ్యే విధంగా చూడాలని, అందుకు తగిన సమగ్ర శిక్షణ పొందాలని సూచించారు. ఏటీఎం, వరి గట్లను పెంచి కూరగాయలను పెంచడం ద్వారా పురుగుమందుల అవశేషాలు లేని ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని రైతులకు అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనింగ్ టీమ్ సభ్యులు, జోన్స్, జోసఫ్‌రాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితికి ప్రత్యేక ఏర్పాట్లు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో వినాయక చవితి మహోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. ఆలయంలో గ్రామస్తులు, పురోహితులు, ఆలయ సిబ్బందితో కలసి బుధవారం సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. చవితి ఉత్సవాలకు వచ్చే భక్తులకు సదుపాయాల కల్పన వంటి అంశాలపై గ్రామస్తులతో ఈఓ చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, ఆలయ చైర్మన్ జి.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బకాయిలు చెల్లించాలి

మామిడికుదురు: రెండు నెలల జీతం బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుబ్బారావు, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. కోర్టు తీర్పు మేరకు 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని, ఉపాధ్యాయులకు యాప్‌ల భారం పూర్తిగా తొలగించాలని, విద్యాశక్తి కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.పెద్దిరాజు, టీఆర్‌కే గణపతి, మొహియుద్దీన్, ఎం.సత్యనారాయణ, ఐ.రవి, కె.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



పెదపట్నంలంకలో యూటీఎఫ్ మెంబర్ షిప్ కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ నేతలు

ప్రతి రైతుతో హుందాగా వ్యవహరించాలి

మామిడికుదురు: బ్యాంకుకు వచ్చే ప్రతి రైతుతోను హుందాగా వ్యవహరించాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. ఆయన బుధవారం మామిడికుదురు డీసీసీబీ బ్రాంచ్‌ను ఆకస్మికం తనిఖీ చేశారు. ఉద్యోగుల పనితీరు, రైతులకు అందిస్తున్న సహాయ సహకారాలపై క్షుణ్ణంగా పరిశీలన చేశారు. బ్యాంకులో ఎంటువంటి లోపాలు జరిగిన ఉపేక్షించేది లేదని బ్యాంకు ఉద్యోగులను హెచ్చరించారు. బ్యాంకులో ఎటువంటి అవినీతి జరిగినా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అవినీతికి పాల్పడే వారిని బదిలీ చేయడం కాకుండా సర్వీసు నుంచి తొలగిస్తామన్నారు. సహకార బ్యాంకులో డిపాజిట్లు పెంచే విధంగా ప్రతి ఉద్యోగి పని చేయాలని బాబు ఆదేశించారు. అనంతరం బ్యాంకులో జరుగుతున్న లావాదేవీలపై కాకినాడ బ్రాంచ్ నుంచి వచ్చిన అధికారులు తనిఖీలు చేశారు.



మామిడికుదురు డీసీసీబీలో రైతుతో మాట్లాడుతున్న చైర్మన్ బాబు

అభివృద్ధి పనులు చేపట్టాలని ఓఎన్జీసీకి వినతి

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఓఎన్జీసీ అధికారులకు స్థానికులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. 45 ఏళ్ల నుంచి ఓఎన్జీసీ కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో సుమారు 18 డ్రిల్లింగ్ సైట్లు ఏర్పాటు చేసి వాటి నుంచి ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను పైప్‌లైన్ల ద్వారా తరలిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల పంట భూములు పాడైపోయాయని, ఓఎన్జీసీ వల్ల తమ గ్రామానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తమ గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. డ్రైన్లు నిర్మించాలని, పంట నష్టపోతున్న వరి, కొబ్బరి రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని, హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వాలని, హైస్కూల్ లెవెలింగ్‌కు నిధులు మంజూరు చేయాలని ఓపెన్ జిమ్, గ్రంథాలయం భవన నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని, చింతలమెరకలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, డ్రింకింగ్ వాటర్‌కు అవసరమైన వెహికల్ మౌంటెడ్ ట్యాంకరుకు నిధులు ఇవ్వాలని, సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం ఇచ్చారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాశర్లపూడిలో ఓఎన్జీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మృతుల కుటుంబాలకు పరామర్శ


మామిడికుదురు: ఇటీవల మృతి చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు నేతల కుటుంబాలను పి.గన్నవరం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు బుధవారం పరామర్శించారు. వారి చిత్రపటాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. పెదపట్నం గ్రామానికి గోగి శరత్‌కుమార్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. అతని కుటుంబ సభ్యులను కో–ఆర్డినేటర్ పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఏడుకొండలకు నాయకుల పరామర్శ

అంబాజీపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గంగలకుర్రు అగ్రహారం, ముషిణివారి పాలెంలో విశ్రాంతి తీసుకుంటున్న ఉపాధ్యాయుడు దొంగ ఏడుకొండలను జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పరామర్శించారు. ఏడుకొండలు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని మనోధైర్యం కల్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ డి.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బి.వరలక్ష్మి, ఎంపీటీసీ వి.దుర్గాభవాని తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలి

కొత్తపేట: డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవాలని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచించారు. బుధవారం ఆత్రేయపురం మహాత్మాగాంధీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై రాము అధ్యతన జరిగిన సదస్సులో డీఎస్పీ మురళీమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డిజిటల్ ప్రపంచంలో సైబర్ నేరాలు అనేకం జరుగుతున్నాయన్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ చాలా ఉపయోగకరమైన సాధనం అని, ఎమర్జెన్సీ సమయంలో మహిళలు దీన్ని ఉపయోగించి పోలీసులకు వెంటనే సమాచారం అందించవచ్చన్నారు. సదస్సులో కళాశాల సెక్రటరీ,కరస్పాండెంట్ పీఎస్ రాజు, ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆత్రేయపురం కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ సుంకర మురళీమోహన్

ట్రస్ట్ సేవలు అభినందనీయం

రాజోలు: ఎస్సీ బాలుర వసతి గృహం నూతన భవన నిర్మాణాన్ని ముదునూరి అక్కిరాజు మెమోరియల్ అండ్ కల్చరల్ ట్రస్ట్ సొంత నిధులతో నిర్మాణం చేయడం అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. వసతిగృహ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎస్సీ బాలుర వసతిగృహం శిథిల స్థితికి చేరడంతో అక్కిరాజు ట్రస్ట్ ద్వారా వసతిగృహ భవనాన్ని పూర్తి చేసేందుకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. వసతిగృహ నిర్మాణంలో ప్రభుత్వపరంగా ఎలాంటి సహకారమైన అందిస్తామన్నారు.

చంద్రబాబు అంటేనే వంచన

మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు అంటేనే వంచన అని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్ర అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వంచన ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇరువురూ పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అంటేనే మోసం అని చంద్రబాబు చేస్తున్న మోసాలను, ప్రతి ఒక్కరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాలను, చంద్రబాబు ఇచ్చిన దొంగ హామీల వల్ల ఈ సంవత్సరంలో ప్రజలు ఎంత నష్టపోయారో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజలకు కరపత్రాలను పంచి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఏడాది కాలంలో ఇంతటి ఘోర వైఫల్యం పొందిన ఏకైక ప్రభుత్వం ఇదేనని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అడబాల వీర బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, జెడ్పీటీసీ సభ్యురాలు బల్ల ప్రసన్నకుమారి, కటకంశెట్టి ఆదిత్య, మోకా సురేష్, గుర్రం జాషువా, మాజీ ఎంపీటీసీ గుండుమేను నారాయణమూర్తి, జిల్లెళ్ళ ఉదయ్‌కిరణ్, గ్రామశాఖ అధ్యక్షుడు తాడి కాశీ, మాజీ సర్పంచ్ నల్లి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలతో మళ్లీ మోసం

మామిడికుదురు: ఎన్నికల్లో చంద్రబాబు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజల్ని మోసం చేశారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు మోసంతో ప్రజలు ఏడాదిగా ఎంతో మోసపోయారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం కరవాక గ్రామంలో జరిగింది. అగ్నికుల క్షత్రియుల ఆరాధ్య దైవం కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి గొల్లపల్లి, నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ మట్టపర్తి నాగేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రజలు ఎంత మేర నష్టపోయారో తెలుసుకునే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేకాడి సత్యనారాయణ, గ్రామశాఖ అధ్యక్షుడు ఛందాది వర్మ, పార్టీ నేతలు భగవాన్, నారాయణ, ఏసుబాబు, కటకంశెట్టి ఆదిత్య, మోకా సురేష్, గుర్రం జాషువా పాల్గొన్నారు.



గొల్లపాలెంలో పార్టీ జెండా ఆవిష్కరించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మట్టపర్తి నాగేంద్ర

మోసకారి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలి

పి.గన్నవరం: ఎన్నికల సందర్భంగా ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి ఏడాదిన్నర కాలమైనా వాటిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు నాయుడుకి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ పర్యవేక్షణలో కె.ఏనుగుపల్లి, పి.గన్నవరం గ్రామాల్లో ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు యల్లమెల్లి సత్యనారాయణ, చింతపల్లి నర్సింహమూర్తిల ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ, రచ్చబండ కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. గన్నవరపు ప్రజలను కలుసుకుని చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను చంద్రబాబు నిలిపి వేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మందపాటి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కొక్కిరి రవికుమార్, దాసరి కాశీ, కొల్లే సూర్యనారాయణ, గంధం ఏసు, దూనబోయిన రవిచంద్ర, తాటికాయల మధుబాబు, పుచ్చకాయల నర్సింహమూర్తి, వల్లూరి సత్యనారాయణ, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కె.ఏనుగుపల్లిలో చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పోరాట యోధుడు ‘జక్కంపూడి’



మాజీ మంత్రి జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు



పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న గన్నవరపు



రాజోలులో జక్కంపూడి జయంతి వేడుకలు

రావులపాలెం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు జయంతి సందర్భంగా బుధవారం రావులపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జక్కంపూడి ఉభయ ఉమ్మడిగోదావరి జిల్లాల వాసులకు ఆయన ఎంతో సుపరిచితుడని జగ్గిరెడ్డి అన్నారు. ఆయన ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, ఆముదా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచులు కర్రి గోవిందకృష్ణారెడ్డి, తమ్మన శ్రీను, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా నాయకుడు కప్పల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో పార్టీ నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, అడ్డగళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ప్రజానాయకుడిగా కీర్తి గడించారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం రాజోలు మార్కెట్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద జక్కంపూడి రామ్మోహనరావు జయంతి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య జక్కంపూడి జయంతి కేక్ కట్ చేశారు. రాజోలు, మండపేట నియోజవకర్గ పరిశీలకులు మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, సర్పంచ్ రేవు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురు: దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు పోరాట యోధుడని రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ శ్లాఘించారు. జక్కంపూడి జయంతి పురస్కరించుకుని బుధవారం మామిడికుదురు సెంటర్‌లో రామ్మోహనరావు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే ఆరోగ్యం

మలికిపురం: తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం లభిస్తుందని రాజోలు ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. బుధవారం మలికిపురం-1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఇందిర పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల పర్యవేక్షణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ కె.హైమావతి, అంగన్‌వాడీ టీచర్లు కె.సుజాత, కె.స్వాతి, సీహెచ్ జ్ఞానేశ్వరి, డీఎం సుజాత, ఎం.చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: తల్లి ముర్రుపాలు బిడ్డకు ఆరోగ్యమని, ఆ పాలతో శిశువుకు రోగనిరోధక శక్తి పెంపొందుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మెట్లకాలనీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి అధ్యక్షతన జాతీయ తల్లిపాలు వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారాన్ని బాలింతలకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.దుర్గాదేవి, జి.వెంకటలక్ష్మి, ఏఏఎల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆలమూరు: జొన్నాడలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొత్తపేట సీడీపీఓ అధికారి గజలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతున్నా తల్లిపాల కంటే మెరుగైన ఆహారాన్ని తయారు చేయలేకపోయిందన్నారు. అనంతరం స్థానికులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, పసుపుకుంకుమ అందించి అక్షతలు వేసి ఆశీర్వదించారు. తల్లి పాల ఆవశ్యకతను ఆయా ప్రాంతాల సూపర్‌వైజర్లు టిఎన్‌వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి వివరించారు.



జొన్నాడలో సామూహిక సీమంతాలు చేసి ఆశీర్వదిస్తున్న పీడీ శాంతకుమారి